కథానిక:

# సముద్రపు ఒడ్డు

శ్రీ విశ్వనాథ కృష్ణదేవరాయలు

## 1

ఇదివరకల్లా ఎంతో స్వచ్ఛంగానూ, ప్రశాంతంగానూ, ఆనందకరంగానూ కనబడే ఆ సముద్రపు ఒడ్డు, ఈనా డింత విషాదంగా కనిపిస్తూ నాలో విరక్తి కలిగించడానికి కారణ మేమిటో! ఆ యిసుకతిన్నెలమీద ఎన్నిరోజులు మైమరచి ఆడుకోలేదు! సముద్రపు కెరటాల మీంచి వచ్చే కమ్మనిగాలి తృప్తిగా పీల్చుకుని ఎన్నిసార్లు అనుభవించలేదు! అస్తమయ సూర్యుని బంగారు కిరణాలు, ఆనందంలో పొంగిపొరలే లేత కెరటాల చివళ్ళమీదపడి మెరుస్తూవుంటే ఎన్నిసార్లు బ్రహ్మానందపడి తన్మయత్వం చెందలేదు! ఈనా డింత దారుణంగా నాలో విపరీతమైన ఆవేదనకు ఈ సముద్రపు ఒడ్డు కారణం కాదుగదా! ఈ అమాయికపు లేతకెరటాలు కావు గదా.....కావు....ఆ గాలి పిల్లలకే, సముద్రపు కెరటాలకే, నేనంటే ఎంతో యిష్టం.... నేను లేనిదే అవ్వీ ఒక్కనిముషంకూడా ఆనందంలో ఉండలేవు. అంచేత అవ్వి నా కింత ద్రోహం చెయ్యవు. ఈ సముద్రపు కెరటాల్ని నేను మనసారా ప్రేమించాను. అతనంటే ఎంత ప్రేమో, ఈ గాలిపిల్లలన్నా నాకు అంతే ప్రేమ. ఈ యిసుకతిన్నెలలోని ప్రతి అణువూ నా అనురాగాన్ని చూరగొన్నవి. ప్రతిదినం సాయంకాలం వాహ్యాళికి వస్తే, అతన్నీ నన్నూ చూసి, ఆ పాలపిట్టలు సిగ్గుపడి తమ సంగీతాన్ని ఆపు చేసేవికదూ....దూరాన ఉప్పుకొఠార్లలో పనిచేసే కాపు పడుచులు మావంక చూసి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మమ్మల్ని చూచీ చూడనట్లు తమ పనిలో నిమగ్నులయ్యేవారు కదూ..... నిన్నటిదాకా ఎంతో ఆనందాన్నిచ్చిన చందమామ ఇవ్వాళ ఇంత వెటకారంగా నా కెందుకు కనుపించాలి.... వెన్నెలంటే నా కెంతో యిష్టం... మరి ఈనాడు.... వెన్నెల్లో కూర్చోటానికే మనస్కరించడం లేదే!

నాలుగురోజుల క్రిందట ఇల్లాంటి వెన్నెల్లోనే అతని వక్షస్థలం మీద తలాన్చి చంద్రునివంక చూస్తోంటే "చంద్రునికంటె నువ్వే బాగున్నావు" అని అతడు నన్నంటే....చంద్రుడికి కోపంవచ్చి మబ్బులో దాక్కున్నాడు కదూ... ఎప్పుడూ అంతే ఈ చంద్రుడు... వట్టి చుప్పనాతమ్మా... మళ్ళీ ఎన్నాళ్ళకో, ఈ వెన్నెలా....ఈ చందమామ మూతివిరుపులూ... గాలి పిల్లల సరాగ లూను.....

ఇందాకటినుంచీ నా ఆవేదననీ, దుఃఖాన్నీ చూచి ఈ చిన్న చిన్న కెరటాలు నా కాళ్ళు నాసుకుని ఎల్లా బుజ్జగిస్తున్నయ్యో. ఇవ్వాళ ఏ గాలిపిల్ల మొహాన కూడా కళాకాంతుల్లేవు....ఎందుకో వీటికి నేనంటే ఇంత ప్రేమ..... అతనితో మాట్లాడితే మా అత్త ఎంత కోపగించుకునేది.... ఎప్పుడూ చిర చిర లాడేది. అతనూ నేనూ ఏ క్షణం కలుసుకున్నా ఆవిడ ఆగ్రహానికి పాత్రులయ్యే వాళ్ళము.... మరి ఈ పనికూనలకి నేనంటే ఎందుకో యిష్టం..... ఇంతాక అతనంటే కష్టంవేసి చంద్రుణ్ణి చుప్పనాతన్నానుగాని, చంద్రుడికి మాత్రం నామీద జాలి లేదూ,....అతని మొహం ఎంత కళావిహీన మైందో యివ్వాళ. ఒకరోజున అతడు నన్ను పాట పాడమని వేధిస్తే....నేను సిగ్గుపడి పాడనంటే....అతనికి కోపం వచ్చింది. మరి ఆనాడు ఈ చందమామ కాదూ మా ఇద్దరికీ తగూ తీర్చింది.....మళ్ళీ ఎన్నాళ్ళకో చందమామ మమ్మల్నిద్దర్నీ ఆశీర్వదించేది.....అసలు అతను మళ్ళీ కలుసుకుంటాడా... ఈ వెన్నెల రాత్రులు మళ్ళీ అనుభవిస్తానా....ఏమో........

## 2

నిన్నకూడా, అతనూ నేనూ రోజూమల్లేనే సముద్రపు ఒడ్డుకి షికారువస్తా మనుకున్నాను....ఎంత పిచ్చిదాన్ని....కాని నా మనస్సులో ఏదో....భయంగానే వుంది, రేపో మాపో ఇతన్ని పోలీసులు పట్టుకుంటారని... కాని ఇంత త్వరలో అతన్ని ఖైదు చేస్తారని అనుకోలేదు. రోజూ అతన్ని పోలీసువాళ్ళకి యిష్టంలేని పనులు చెయ్యవద్దని వారించే దాన్ని. కాని అతడు ఊరుకుంటాడూ. నే నా విషయం చెప్పినప్పుడల్లా అతడు నన్ను విచిత్రంగా సమాధాన పరిచేవాడు. ...ఎంత తెలివైనవాడు!.... నిన్న దెబ్బలాటలో ఇద్దరు పోలీసులు చచ్చిపోయారని కూడా వార్త ....వాళ్ళ చావుకు అతనే కారణ మని నేరం మోపారు కూడాను....అత నెప్పుడూ ఇంకోళ్ళని చంపడు.. అత నల్లాంటివాడు కాడు. నాకు గట్టి నమ్మకం.....అతన్ని ఏం జేస్తారో!....ఉరిశిక్ష వేస్తారా....అమ్మో!....ఉరిశిక్ష!....ఎంత కఠోరం!.... అతని అందమైన మెడని నరికేస్తారా.... ....నే బ్రతకగలనూ....ఒక్క నిముసం ఉండలేను ....అతనికి ఉరిశిక్షే....అత నెంత తెలివిగలవాడు.... అత నెంత చెబితే మనసబుగా రంత....కరణంగారికి అతనంటే ఎంత ప్రేమ....అతని మూలంగానే కదూ మొన్నటినుంచీ మనసలు కరణాలు ఖద్దరు కట్టడం మొదలెట్టింది. మాగూడెం కూడా అతనంటే పంచప్రాణాలూ విడుస్తారు కదూ....నిన్న అతన్ని పోలీసులు తీసుకు వెడతూంటే, గూడెం గూడెం అంతా అతన్ని సాగనంపారు కదా.....అతను జైలుకు వెడుతూంటే అతని ముఖంలో ఏమయినా విచారం కనపడిందా....ఎంత ఠీవిగా వున్నాడో.... అప్పు డతన్నిజూస్తే....నాకు అతన్ని పూజ చేయాలనిపించింది....అల్లాంటివానికి ఉరిశిక్ష వేస్తారూ.... అల్లాంటిపనే జరిగితే నేనూ చచ్చిపోతాను.... మనసబుగా రూరుకుంటారా....

ఎన్నిసార్లో నాకు చదువు చెప్పతా నన్నాడు. నా చేతకూడా ఖద్దరు చీర కట్టించాడు కదూ....అతనికి నేను ఈ కాఫీ కలరు రైక తొడుక్కుంటే ఎంతో యిష్టం. నేను ఈ రైక తొడుక్కున్నప్పు డల్లా నన్ను ఎంతో అందంగా వున్నావని పొగిడేవాడు..... నాకు అతన్ని ప్రేమించడం ఒక్కటే పని.... ఎప్పుడూ అతన్నిగురించి ఆలోచించడమే. కాని ఇంకో పనిలేదు. మరి అతనికో ఎన్నో పనులు.... రోజూ ఎన్నో రాచకార్యాలు చేసేవాడు. ఊళ్లో ఏ తగూ వచ్చినా అతను తీర్చాల్సిందే. ఊళ్లోకి పరాయి పెద్దమనిషి ఎవ రొచ్చినా అతన్ని కలుసుకోకుండా వెళ్లేవాళ్లు కారు. పట్నంనుంచి కూడా మొన్న ఎవరో వచ్చి ఆయనింట్లో, మొన్న మూన్నాళ్ళు బసచేశారు కదూ. ఆయన కెంతో పలుకుబడి. ఈ చుట్టుపక్కల వాళ్ళంతా ఆయనకు జోహారు చేస్తారు కదూ.... ఆయన ఇన్ని పన్లూ చూసుకుంటూ ఏమీ అనుకోకుండా నాతో షికారు వస్తూనే యుండేవారు....నన్ను ప్రేమిస్తూనే ఉండేవారు....అబ్బా! ఎంత గొప్పవాడాయన....అంకటారం ఆయనమీద వున్నా నామీద ప్రేమమాత్రం పోయేది కా దాయనకు....ఆయన సత్యాగ్రహం చేస్తా నంటే నా కేడు పొచ్చింది. ఆ రోజున నన్నాయన బుజ్జగించడం మరచిపోలేను. మరునా డెంతో గర్వపడ్డాను. మన ఊళ్లో "అంతగా ఆయన ప్రేమ చూరగొన్న ఏ స్త్రీ గాని స్నేహితుడు గాని వున్నారా" అని. ఆయనా నేనూ స్నేహంగా వుంటున్నామని ఎంతోమంది ఎన్నో రకాలుగా అనుకున్నారు.....అయినప్పటికీ లెక్కచేసే వాడు కాడాయన....ఎప్పుడయినా నే నీ ప్రసక్తి తెస్తే ఆ విషయం మరపించేవాడు కదూ....ఆయనతో స్నేహం మొదలెట్టిం తరువాత నా కెన్ని విషయాలు తెలిసినయ్యో. ఎన్నో విషయాలు చెప్పేవాడు ....ఇది వరకు కన్నా ఎంతో సుఖంగా ఉండేదాన్ని. ఏ ఊరన్నా వెళ్ళి నాకోసం అందమైన వస్తువులు తెచ్చేవాడు....ఇప్పు డవ్వన్నీ చూస్తే గుండె తరుక్కుపోతూంది.

ఒకసారి ఆయన బస్తీ వెళ్ళి, రెండు మూడు రోజులదాకా రానని అక్కడనుంచి జాబు వ్రాశారు.... ఆ జాబు ఎంత హాయిగా వుంది. ఎంత ఘుమ ఘుమలాడింది....నేనంటే ఎందుకో ఆయన కంత యిష్టం. నాకు ఎన్నో పాటలు చెప్పాడు. నేను పాడితే కోయిల పాడినట్లుంటుందట. నే పాడుతోంటే కళ్ల తేలవేసి తన్మయత్వం చెందేవాడు.....రోజూ ఈ సముద్రపు తడ్డున కూర్చొని మబ్బు వంక రెప్ప వాల్చకుండా చూస్తూయుండే వాళ్ళం.....అబ్బ!....ఆ విషయం తల్చుకున్నప్పుడు, మళ్ళీ అల్లాంటి దినాలు వస్తాయా అనిపిస్తుంది. ఒకరోజు సాయంత్రం సముద్రంలో స్నానం చేస్తూంటే ఒక పెద్ద కెరటం నా మీంచి వెళ్ళి నన్ను పడత్రోయటం మూలాన నాకు ఉక్కిరిబిక్కిరైంది. అప్పు డాయన తన రెండు చేతుల్తోనూ నన్ను లేవతీసి తన హృదయానికి హత్తుకున్నారు. ....అప్పు డెంత హాయి అనిపించిందో.

రోజూ యిసుక తిన్నెలమీద రాత్రి చాలా సేపటివరకూ 'ఆడుకుని ఇంటికి వస్తూంటే నాకు భయం వేసేది. కీచురాళ్ళు ఊరికే ధ్వనిచేస్తూ వుండేవి. ఏ కాస్త చప్పుడయినా ఉలిక్కి పడేదాన్ని.....ఒక్కొక్కప్పుడు ఆయన ఉత్తరీయంతో నా మెడకు చుట్టుకుని నడుస్తూ, ఆయన చేతిని నామీద నుంచి తియ్యనిచ్చేదాన్ని కాదు. అల్లా ఎంతసేపన్నా నడిచేవా రాయన... రోజూ మా యింటిదాకా దిగబెట్టి వెళ్లేవా రాయన....

రేపు విచారణ జరగుతుందికాబోలు! అయినా ఆయన ఏమీ నేరం చెయ్యలేదుకదా.... రోజూ ఉపన్యాసాలు చెప్పేవాడు.... పోలీసులు ఊళ్లోకి వస్తే, ఊళ్లో వాళ్లూ పోలీసులూ కొట్టుకున్నారు....దెబ్బలాటన్నప్పుడు ఎవరో ఒక్కరో దావరా....పోలీసులు చచ్చారు....అదే ఊళ్లో వాళ్ళయితే ఏ కేసూ ఉండేది కాదు. అయినా వాళ్ళను ఆయన కాదుగదా చంపింది. వాళ్ళను చంపమని కూడా ఉపన్యాసాలు చెప్పలేదు. పాపం, పోట్లాట జరుగుతోంటే పోట్లాడవద్దని హెచ్చరించలేదూ? ఇన్నీ చేసినా ఆయన్నే పోలీసువాళ్లు పట్టుకెళ్లారు. పైగా నేరమంతా ఈయనమీదే త్రోశారట. ఉరిశిక్ష వేస్తారేమో....ఊళ్ళో అందరికీ కోపాలుగా కూడా ఉన్నాయి....ఆయన్ని ఉరితీస్తేనా, ఊళ్లో అందరూ పోలీసుల్ని నరకెయ్యరూ. ...

ఇక రేపట్నుంచీ సముద్రపు ఒడ్డుకు రాను. ఎంచేతనో సముద్రపు ఒడ్డు యిదివరకల్లే అనుభవించలేకుండా వున్నాను. ఆయన లేకపోతే నాకీ సముద్రపు ఒడ్డూ, గాలిపిల్లలూ దేనికి....రేపటినుంచీ రాను ....అయినా రేపటి సంగతి ఎల్లా వుంటుందో.... ఎల్లాంటివార్త వింటానో....

## 3

గాలిపిల్లా! అతన్ని ఉరిదీశారు. చందమామా! అతన్ని ఉరిదీశారు. సముద్రమా! అతన్ని ఉరిదీశారు.....అతని మంచి దనం మీకు తెలును కదూ. అతని ప్రేమా అతని ఔదార్యం మీకు తెలును కదూ ....అతని రూపురేఖ లావణ్యాలకి మీరుకూడా మురిసిపొయ్యారు కదూ....మాట్లాడవేమి చందమామా.... నువ్వు కూడా ఏడుస్తున్నావటోయి....ఏడువకు నాయనా. ..ఏడువకు ..ఆ దుఃఖాన్ని నేనొక్కదాన్నే భరించడానికి పుట్టాను....గాలిపిల్లలూ మీరు ఆడుకో రేం? మీరుకూడా విచారపడుతున్నారా. . అవును అతనిలాటి వాళ్ళని యిదివర కెప్పుడూ చూడలేదు కాబోలు మీరు....సముద్రా! నీ ఆనందం తగ్గిపోయిందేమోయి ఇవ్వాళ....ఎందుకు స్వామీ ఆ విచారం.... సముద్రపు ఒడ్డూ! నిన్నీ నేను మరచిపో నమ్మా! ....అతనూ నేనూ కూర్చున్న ఈచోటు చాలా పవిత్రమైందీ... మా యిద్దరిదీ స్వచ్ఛమైన ప్రేమ అయితే ఏం ప్రయోజనం?....అతనూ నేనూ ఈ జన్మలో కలసుకునే దినాలు ముగిసినవి.. .అతన్ని పోలీసులు చంపేశారు....నేనూ చచ్చిపోతాను....ఎల్లా బ్రతకమంటావు చెప్పు. ..ఇంత దుఃఖాన్ని భరించగలనా.... నువ్వుమాత్రం మా యిద్దరినీ మరచిపోకేం....ఈ పవిత్రమైన సముద్రపు కెరటాల్తో ఈ పుణ్యస్థలం తడుస్తూ యుంటుంది....అంతే చాలు....నేను కూడా చచ్చిపోవడానికి నిశ్చయించుకున్నాను. నాకూ ఈ ప్రపంచానికీ ఏమాత్రమైన సంబంధమూ లేదు.... ఇంటికి వెడితే నా విచారాన్ని చూసి, మా అత్త ఎత్తిపొడుపు మాటలు అన్నేకాక ఆయన్ని కూడా అంటుంది. అవ్వి నేను భరించలేను......నా జీవితం ముగిసిపోతోంది....నా చిన్ని సముద్రపు కెరటమా! మళ్ళీ ఎన్నడయినా నిన్ను కౌగలించుకుని నీ చక్కిలిగింత అనుభవించే భాగ్యం వున్నదా....గాలి పిల్లలారా! సెలవు!....మన స్నేహాలకు ఇదే చివరి ఆలింగనం....చందమామా! నా కథ నీ స్నేహితు లందరికీ చెబుతావు కదూ.



గాంధిజీ అక్టోబరునెల 25 తేదీనాడు ఢిల్లీ జైలులో ప్రార్థనజరిపిన సందర్భపు చిత్రం


## భారత లక్ష్మీబ్యాంకు లి॥

(షెడ్యూల్డు బ్యాంకు)

హెడ్డాఫీసు: మచిలీపట్నం.

బ్రాంచీలు:

కాకినాడ, కాకలి, గవర్నరుపేట, (బెజవాడ), గుడివాడ, గూడూరు, నరసాపురం, నూజివీడు, బెజవాడ, బొబ్బిలి, రామారావుపేట (కాకినాడ), రాజోలు.

మద్రాసు బ్రాంచి: 15-ఎ, ఆర్మీనియన్ వీధి,

అన్ని విధములైన బాంకింగు వ్యాపార సౌకర్యములు చేయబడును.

భో॥ వెంకటరత్నం, మేనేజింగు డైరక్టరు.